క్లుప్తంగా

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని ఇమామ్‌గూడ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తన తోటి విద్యార్థులకు ఒక్కరోజు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీకుమారి, తుక్కుగూడ క్లాంపెక్స్ హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటలెక్చువల్ ఫోరం జిల్లా కన్వీనర్‌గా ఆంజనేయులు



నియామకపత్రం అందుకుంటున్న ఆంజనేయులు

బడంగ్‌పేట్: జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్‌గా బొల్లంపల్లి ఆంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు బీజీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు శనివారం ఆంజనేయులుకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ.. బీసీలు విద్యా, ఉద్యోగం, రాజకీయంలో ప్రాతినిధ్యం కోసం బీసీ ఇంటలెక్చువల్ ఫోరం పనిచేస్తుందన్నారు. బీసీల సమస్యలపై నిరంతరం పని చేయడంతో పాటు బీసీల అస్తిత్వం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు అనంతుల శ్రీనివాస్, సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు చామకూర రాజు, గోర శ్యామ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థినులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థినులకు బ్యాగులు, ప్యాడ్లు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

కందుకూరు: హైదరాబాద్‌లోని ల్యాబ్ ఇన్ఫర్మేటిక్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, పరీక్షా ప్యాడ్లు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో పోటీ విపరీతంగా ఉంటుందని, దానికి అనుగుణంగా విద్యార్థులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. సృజనాత్మకంగా ఆలోచిస్తూ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జగన్ మాట్లాడుతూ.. చదువుకు పేద, ధనిక అనేది అడ్డురాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులే ఉన్నతంగా రాణిస్తారని, నేటి సమాజంలో ఒడిదుడుకులను తట్టుకునే శక్తి వాళ్లకే అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్.కవిత, జిల్లా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అధికారి కృష్ణ, జిల్లా బాలికా విద్య ప్రత్యేకాధికారిణి సుజాత, సాఫ్ట్‌వేర్ సంస్థ అధికారులు కీర్తి, శ్రీనివాస్‌రెడ్డి, కె.రాజశేఖర్, మాధవ్, మహేందర్, సతీశ్, కే.గోవింద్, అనిల్‌కుమార్, పి.కీర్తి, ఉపాధ్యాయులు కే.గోపాల్, లక్ష్మీదేవి, పుష్ప, చంద్రకళ, జ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



బేస్‌మెంట్‌ను కూల్చివేస్తున్న అధికారులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన రెండు అక్రమ కట్టడాలపై అధికారులు చర్యలు చేపట్టారు. పహాడీషరీఫ్ ప్రధాన రహదారి పక్కనున్న అటవీ ప్రాంతాన్ని కబ్జా చేసేందుకు ఓ మాజీ ప్రజా ప్రతినిధి బేస్‌మెంట్ ప్రారంభించాడు. ఈ విషయమై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో కమిషనర్ బి.వెంకట్రామ్ పర్యవేక్షణలో టీపీవో హబీబున్నీసా శనివారం సిబ్బందితో కలిసి సదరు నిర్మాణాన్ని జేసీబీతో కూల్చివేయించారు. అనంతరం శ్రీరాం కాలనీ ప్రధాన రహదారిని ఆక్రమించిన నిర్మాణాన్ని కూడా కూల్చివేశారు. మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు.

వృథాగా దుకాణ సముదాయం!

- నిరుపయోగంగా రావిర్యాలలోని షెడ్లు
- రోడ్లపైనే చిరు వ్యాపారం
- పట్టించుకోని అధికారులు



రావిర్యాలలో వ్యాపారుల కోసం నిర్మించిన షెడ్లు

తుక్కుగూడ: చిరు వ్యాపారులు, ప్రజలకు మౌలిక వసతులు కల్పించే ఉద్దేశ్యంతో మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలో నిర్మించిన దుకాణాల షెడ్లు వృథాగా మారాయి. రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన దుకాణాల సముదాయాలను చిరు వ్యాపారులకు కెటాయించ లేదు. దీంతో వార్డు కార్యాలయం వద్ద రోడ్డుపైనే ఆకుకూరలు, కూరగాయాలు, పండ్లు తదితర సరుకులను విక్రయిస్తున్నారు. ప్రస్తుతం నిర్మించిన మార్కెట్ సముదాయంలో కొనుగోలుదారులు రారని, చిరు వ్యాపారులు అక్కడికి పోవడానికి ఆసక్తి చూపడం లేదు.

రూ.30 లక్షలతో నిర్మాణం

రావిర్యాల చౌరస్తాలో, వార్డు కార్యాలయ ఆవరణలోని వెనుక భాగంలో మున్సిపాలిటీ సాధారణ, పట్టణ ప్రగతి కింద రూ.30 లక్షల నిధులను ఉపయోగించి దుకాణాల సముదాయాన్ని నిర్మించారు. పూర్తయిన అనంతరం అప్పటి విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం ప్రస్తుత ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి 2023, ఆగస్టు, 26న ప్రారంభించారు. 18 నెలలు గడుస్తున్నా వీధి వ్యాపారులకు అధికారులు కెంటాయించడం లేదు.

రోడ్డ పైనే అమ్మకాలు

ఈ గ్రామంలో కూరగాయాలు, ఆకు కూరలు సాగు చేసే రైతులు, ఇతర చిరు వ్యాపారులు వార్డు కార్యాలయం వద్ద రోడ్డు పైనే క్రయ, విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాల, వార్డు కార్యాలయం ఉండటంతో రద్దీ ఉంటుంది. ఆదివారం రావిర్యాల, కొంగరకలాన్, మంగల్‌పల్లి, ఆదిబట్ల, సర్దార్‌నగర్ తదితర గ్రామాల్లోని ఇటుక బట్టీల వద్ద పనిచేసే కార్మికులు వందల సంఖ్యలో వస్తారు. చిరు వ్యాపారులు ఆసక్తి చూపక పోవడంతో దుకాణాల షెడ్లు వృథాగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి షెడ్లను వ్యాపారులకు కెంటాయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

షెడ్ల సైజ్ పెంచాలి

రావిర్యాలలో మున్సిపాలిటీ అధికారులు నిర్మించిన షెడ్లు చిన్నవిగా ఉండటంతో వ్యాపారులు అక్కడికి పోవడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం నిర్మించిన వాటిలో రెండు షెడ్లను ఒకటిగా చేసి కెంటాయించాలి.

– గోనమోని శివశంకర్, చిరు వ్యాపారి, రావిర్యాల

త్వర్వలో సమస్య పరిష్కరిస్తా

రావిర్యాల చిరువ్యాపారుల దుకాణాలను వ్యాపారులకు కెంటాయించ లేదనే విషయం నా దృష్టికి వచ్చింది. త్వరలో అక్కడి పరిస్థితులను పూర్తి స్థాయిలో తెలుసుకొని త్వరలో సమస్య పరిష్కారిస్తా.

– వాణి, మున్సిపల్ కమిషనర్, తుక్కుగూడ

మానసిక ఆరోగ్యంపై అవగాహన



మోడల్ స్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పాల్‌రెడ్డి భవానీ

కందుకూరు: నేదునూరు పరిధిలోని మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు కొత్తగూడ పరిధిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో శనివారం గౌతమ ఫౌండేషన్, ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానసిక ఆరోగ్య నిపుణురాలు పాల్‌రెడ్డి భవానీ మాట్లాడారు. 2019 నేషనల్ సర్వే ప్రకారం ప్రతీ సంవత్సరం భారతదేశంలో మానసిక సమస్యల కారణంగా లక్ష మంది జనాభాలో 16.4 శాతం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు సమస్య తీవ్రత ఎలా ఉందో వివరించారు. అనంతరం గౌతమ ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి రజనీకాంత్ మాట్లాడుతూ....ప్రస్తుత కాలంలో విద్యార్థులు ప్రతి చిన్న విషయానికి మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. విద్యార్థులపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి నైముద్దీన్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌శర్మ, భార్గవి, ఆ సంస్థ ప్రతినిధి కిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

- సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్

చేవెళ్ల: డివిజన్ పరిధిలో గ్రామాల రోడ్లన్నీ అధ్వానంగా మారాయని, వాటిని పట్టించుకునే నాథుడు కరువయ్యారని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం సీపీఎం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా ఏ గ్రామానికి ప్రభుత్వాలు రోడ్డు వేసిన పాపన పోలేదన్నారు. దీంతో ఈ రోడ్లన్నీ ఇప్పుడు గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కనీసం మరమ్మతులు కూడా చేయాలనే ఆలోచన అర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు మరిచిపోయారన్నారు. వెంటనే గ్రామాల్లో రోడ్లను వెంటనే బాగు చేయాలని, లేనిపక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు కిష్టయ్య, ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య, సురేశ్, శ్రీనివాస్, కుమార్ ఉన్నారు.

నియామకం



వెంకటేశ్‌కు నియామకపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

కందుకూరు: కందుకూరు మండలం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా బాచుపల్లికి చెందిన కత్తుల వెంకటేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.ప్రీతం, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ పి.పెంటయ్య, నియోజకవర్గ చైర్మన్ శ్రీధర్ తదితరుల చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కేఎల్‌ఆర్‌తో పాటు పీసీసీ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ తదితరులకు వెంకటేశ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అందుగుల సత్యనారాయణ, సయ్యద్ అజీజ్, బాలు, జంగయ్య, టి.భాను, ఎస్.యాదయ్య, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, యు.బాబురావు, వి.బాబు, జి.కుమార్, ఏ.నవీన్‌గౌడ్, పి.కుమార్, కె.రాజశేఖర్, పి.సుధాకర్, కె.శ్రీశైలం, మహేందర్, ఎ.కృష్ణ తదితరులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సర్వేకు మరో అవకాశం

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేలో పాల్గొననివారికి మరో అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని ఎంపీడీఓ సరిత శనివారం తెలిపారు. ఈ నెల 16 నుంచి 28వ తేదీవరకు అవకాశం ఉందన్నారు. సర్వేలో పాల్గొనని కుటుంబాలు టోల్ ఫ్రీ నంబర్ 040–21111111లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించి సమాచారం ఇవ్వొచ్చన్నారు. వారి ఆధార్ వివరాలతో సమాచారాన్ని తనిఖీ చేసి నమోదు కాకపోతే మండల కేంద్రం లేక మున్సిపాలిటీకి గాని సమాచారాన్ని చేరవేస్తారన్నారు. ఆ తర్వాత ఎన్యూమరేటర్లు వారి ఇంటికి వెళ్లి వారి సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారన్నారు. లేదంటే నేరుగా మండల కేంద్రంలోని ప్రజాపాలన సేవా కేంద్రానికి వచ్చి వారి వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. సర్వేలో పాల్గొనని కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి

తుక్కుగూడ: సర్వేలో ఇంతకు ముందు పాల్గొననివారి కోసం పుర పరిధిలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వే నేటి (ఆదివారం) నుంచి ఈ నెల28 వరకు కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని పట్టణ ప్రజలు సర్వేలో వివరాలు ఇవ్వని వారికి మరోమారు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని కమిషనర్ పి.సరస్వతి శనివారం పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి 28 వరకు ఈ అవకాశం ఉంటుందన్నారు. ఎస్‌ఈఈపీసీలో సర్వేలో తమపేర్లు నమోదు చేయించుకోని వారు ఇప్పుడు నమోదు చేయించుకోవాలని కోరారు. అందుకోసం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రజాపాలన కేంద్రంలో సంప్రదించవచ్చన్నారు. లేదా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 040-21111111 కాల్ చేసి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

వివరాలు నమోదు చేసుకోండి

మీర్‌పేట: సమగ్ర కుటుంబ సర్వేలో వివరాలు నమోదు చేసుకోనివారు ఉంటే ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కమిషనర్ జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత నవంబరు నెలలో చేపట్టిన సర్వేలో అందుబాటులో లేని, వివరాలు ఇవ్వని ఇంటి యజమానుల సౌకర్యార్థం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ అవకాశం కల్పించామని, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

సేవాలాల్ మార్గం అనుసరణీయం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు



మహేశ్వరం: ఉప్పగడ్డ తండాలో సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

మహేశ్వరం: గిరిజనుల అభ్యున్నతి కోసం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ ఎంతగానో కృషి చేశారని, ఆయన మార్గం అందరికీ అనుసరణీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండాలో సేవాలాల్ ఆలయం వద్ద బంజార సేవా సంఘం ఆధ్వర్యంలో గిరిజనుల అరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి సందర్భంగా గిరిజన నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజనులు అరాధ్యదైవంగా పూజించే సేవాలాల్ సిద్ధాంతాలు, సూక్తులను అందరూ పాటించాలని సూచించారు. మహేశ్వరం నియోజకవర్గంలో గిరిజనులు(లాంబాడీలు) అధిక సంఖ్యలో ఉండడం అభినందనీయమన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం ఆలయంలో గిరిజనులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకులు కౌశిక్‌రెడ్డి, సేవాలాల్ మహరాజ్ ఆలయ కమిటీ చైర్మన్ సభావత్ సీతారామ్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నేనావత్ ఈశ్వర్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్, గిరిజన బంజార నాయకులు పాండునాయక్, రాములు నాయక్, ఈశ్వర్ నాయక్, వీరా నాయక్, దేవులా నాయక్, గాంసీరామ్ నాయక్, రాజు నాయక్, రతన్ నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ పోల్కం బాలయ్య, కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

లెనిన్‌నగర్‌లో..

మీర్‌పేట: బంజారాల అభ్యున్నతికి సంత్ సేవాలాల్ మహరాజ్ ఎంతో కృషి చేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అఖిల భారత బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం లెనిన్‌నగర్‌లోని బంజారా భవన్ వద్ద జరిగిన భోగ్ బండార్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, స్థానిక నాయకులు ఇంద్రావత్ రవినాయక్, జటావత్ రవి నాయక్, అర్కల భూపాల్‌రెడ్డి, సిద్దాల లావణ్య, అనిల్‌యాదవ్, అర్కల కామేశ్‌రెడ్డి, దిండు భూపేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుతో పాటు స్థానిక నాయకులు పెండ్యాల నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవాలాల్ బాటలో నడవాలి

కందుకూరు: మండల పరిధిలోని గుమ్మడవెల్లితండాలో నిర్మాణంలో ఉన్న సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ గుడి వద్ద మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కాట్రోత్ దేవీలాల్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్, జగదాంబ మాత చిత్రపటాలకు పూలమాల వేసి ప్రత్యేకంగా పూజలు చేశారు. సేవాలాల్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో శివస్వాములు పి.దర్శన్‌గౌడ్, ఎ.శ్రీశైలంగౌడ్, మాజీ వార్డుసభ్యులు ఏకుల మల్లేశ్, గౌని మల్లేశ్, సభావత్ శారద, పెద్దలు భీమ్లానాయక్, సభావత్ లాలు నాయక్, కె.లాలు, ఎస్.గొట్యా, జె.రాజునాయక్, ఎస్.నాగేశ్‌నాయక్, ఎస్.రవినాయక్, ఎస్.గోపినాయక్, ఆర్.హరిలాల్‌నాయక్, సురేశ్‌నాయక్, శ్రీకాంత్‌నాయక్, శంకర్‌నాయక్, తేజ, కిరణ్‌నాయక్, శంకర్‌నాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు సేవాలాల్ మహరాజ్

బడంగ్‌పేట్: కార్పొరేషన్‌లోని ప్రజాభవన్‌లో సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను శనివారం బంజారా నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత, మాజీ కార్పొరేటర్లు హాజరయ్యారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలు వేసి పూజలు చేశారు. గిరిజనుల హక్కుల సాధనకు దేశమంతటా పర్యటించి పోరాడిన మహనీయుడు సేవాలాల్ మహరాజ్ అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

మహేశ్వరం: గిరిజనుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండా సమీపం డబుల్ బెడ్రూం సమీపంలో సంత్ సేవాలాల్ ఆలయంలో గిరిజన బంజారుల అరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఆయన పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డితో కలిసి గిరిజనులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవాలాల్ సిద్ధాంతాలు అందరికీ ఆదర్శమన్నారు. అంతకుముందు సేవాలాల్, దుర్గమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేఎల్లార్, దేప భాస్కర్‌రెడ్డిలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సేవాలాల్ ఆలయ కమిటీ చైర్మన్ సభావత్ సీతారామ్‌నాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నేనావత్ ఈశ్వర్‌నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నేనావత్ రాజునాయక్, బంజార సంఘం నాయకులు అంధ్యా నాయక్, పాండు నాయక్, దేశ్యా నాయక్, రాజు నాయక్, రవి నాయక్, రవీందర్ నాయక్, నందు నాయక్ పాల్గొన్నారు.



గుమ్మడవెల్లితండాలో పూజలు చేస్తున్న గిరిజన నాయకులు తదితరులు



బడంగ్‌పేట్: జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మేయర్ పారిజాత తదితరులు



మహేశ్వరం: జయంతిలో మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి

బీటీ రోడ్డు పనులు ప్రారంభించాలని ధర్నా



పనులు ప్రారంభించాలని ధర్నా చేస్తున్న గ్రామస్తులు

మహేశ్వరం: తుమ్మలూరు–మహేశ్వరం మండల కేంద్రం వరకు అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని గ్రామస్తులు శనివారం రాస్తారోకో నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను అర్ధంతరంగా నిలిపి వేయడంతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కంకర పోసిన రోడ్డుపై, వరదనీరు వెళ్లడానికి వేసిన బ్రిడ్జి వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని శ్రీశైలం జాతీయ రహదారిపై గ్రామస్తులు ధర్నా నిర్వహించారని గుర్తు చేశారు. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసిన ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. వారం రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించకపోతే గ్రామస్తులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. రోడ్డుపై ధర్నా చేయడంతో ట్రాఫిక్ జామ్ కావడంతో మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకొని యువకులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మలూరు గ్రామ యువజన సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

రంగరాజన్‌కు పరామర్శ



రంగరాజన్‌ను పరామర్శిస్తున్న సమితి సభ్యులు

మొయినాబాద్ రూరల్: చిలుకూరు బాలాజీ అర్చకుడు రంగరాజన్‌పై దాడి మూలాలు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కనుసన్నల్లోనే ఉన్నాయని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రవర్తి ఆరోపించారు. శనివారం ఆయన సమితి సభ్యులతో కలిసి చిలుకూరుకు వచ్చి రంగరాజన్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీర రాఘవరెడ్డి ఒక బ్రహ్మణుడిపై జైశ్రీరాం అని చెప్పి దాడి చేసి దాడిని రికార్డును సోషల్ మీడియాలో పోస్టు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పరామర్శించిన వారిలో పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్లాస్టిక్ పార్క్, చిర్వాల్, ఫ్యాబ్‌సిటీ, జిన్నాయిగూడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మహేశ్వరం విద్యుత్ ఏఈ చక్రపాణి తెలిపారు.

షాబాద్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కోటేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షాబాద్, నరేడ్లగూడ, నాగర్‌కుంట, మాచన్‌పల్లి, పోలారం, గోపిగడ్డ, సంకేపల్లిగూడ, మల్లారెడ్డిగూడ, కేశవగూడ, ముద్దెంగూడ, చర్లగూడ, ఆస్పల్లిగూడ, ఎల్గొండగూడ, మరియాపూర్‌లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిలిపివేస్తామన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్



వాటర్‌మెన్‌లతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్రామ్, డిప్యూటీ జీఎం శ్రీనివాస్

పహాడీషరీఫ్: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించామని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం జలమండలి డిప్యూటీ జీఎం శ్రీనివాస్‌తో కలిసి వాటర్‌మెన్‌లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన విషయమై చర్చించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 123 బోర్లు పూర్తిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం రోజుకు 9.5 మిలియన్ లీటర్ల నీటి అవసరం ఉందన్నారు. స్థానికంగా ప్రతి ఇంటికి మూడురోజులకొకసారి కృష్ణా మంచినీటిని సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. 38 మంది వాటర్‌మెన్లు వార్డుల వారీగా అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడూ స్పందిస్తారని వెల్లడించారు. ఎండలు అధికమయ్యాక నీటి సరఫరా తగ్గినట్లయితే ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకర్లతో కూడా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో జలమండలి సూపర్‌వైజర్ రషీద్, లైన్ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్ పాల్గొన్నారు.